సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ၊ 3 ၊ మార్చి ၊ 2024



అంతరిస్తున్న వన్యప్రాణులు

జంతు సంరక్షణ చట్టాలు సక్రమంగా అమలుకాక పోవడంతో వన్యప్రాణులు అంతరిస్తున్నాయి. వేటగాళ్ల చేతిలో బలవుతూనే ఉన్నాయి. 8లో



తాగునీటి కోసం ఆందోళన

తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ అశ్వారావుపేట మండలం కొత్తూరు గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. 10లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు భారీగా నమోద వుతాయి. గంటగంటకూ ఎండ ప్రభావం పెరు గుతుంది. రాత్రి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ



అమ్మవారి సన్నిధిలో ఎస్‌ఈ దంపతులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని టీఎస్‌ ట్రాన్స్‌కో ఎస్‌ఈ బి.శ్రీనివాస్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎస్‌ఈ దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: 2024 – 25 విద్యా సంవత్సరంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో డే స్కాలర్‌గా ప్రవేశం పొందేందుకు జిల్లాలోని పేద గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోయ తెగకు చెందిన ముగ్గురికి, లంబాడాలు ఇద్దరికి, మిగిలిన తెగల్లో ఒకరికి మొత్తం ఆరుగురు విద్యార్థులకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందులో ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 2017 జూన్ – 2018 మే మధ్య జన్మించిన వారు మాత్రమే అర్హులని, అర్హత, ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల దరఖాస్తులకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జతచేసి ఈనెల 11లోపు తమ కార్యాలయంలో సమర్పించాలని పీఓ సూచించారు.

గృహజ్యోతి పథకం అమలు



జీరో బిల్లు అందజేస్తున్న ఎస్‌ఈ రమేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నట్లు విద్యుత్ ఎస్‌ఈ కె. రమేష్ తెలిపారు. శనివారం ఆయన కొత్తగూడెంలో పలువురు వినియోగదారులకు జీరో బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం ఉన్న వారికి జీరో బిల్లులు జారీ చేస్తున్నట్లు వివరించారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా ఎంపిక



ముక్కెర సాహితి

దుమ్ముగూడెం : మండలంలోని పర్ణశాల గ్రామానికి చెందిన ముక్కెర సాహితి ఇటీవల ప్రకటించిన ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా ఎంపికైంది. ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆమె పీహెచ్‌డీ చేస్తోంది. సాహితి తండ్రి డాక్టర్ రామ్మోహన్‌రావు ప్రస్తుతం జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. సాహితి చిన్న వయసులోనే డిగ్రీ కళాశాల లెక్చరర్ కావడం పట్ల పర్ణశాల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సదా మీ సేవలో..

భక్తులకు మరింత చేరువగా భద్రాద్రి రామయ్య

- ఏడాదికాలంలో పలు ఆర్జిత సేవలు ప్రారంభం
- భక్తుల నుంచి విశేష స్పందన
- శాశ్వత పూజలతో నిత్య అనుసంధానం



భద్రాచలం రామాలయం వ్యూ

అందరి బంధువైన భద్రాచల రామయ్య భక్తులకు మరింత చేరువవుతున్నాడు. దేవుడిని భక్తులు అనేక మార్గాల్లో పూజిస్తుంటారు. అయితే భక్తులకు భద్రాద్రి రామయ్యను సరాసరి అనుసంధానం చేసేలా దేవస్థానం ఇటీవల పలు ఆర్జిత సేవలను ప్రవేశపెట్టింది. సర్వ, ప్రత్యేక దర్శనాలతో పాటు భక్తుల ఆర్థిక స్థోమత ఆధారంగా ఇతర పూజల్లోనూ పాల్గొనేలా పలు సేవలు ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు మానసిక ప్రశాంతత, భగవదనుగ్రహం లభించేలా చర్యలు తీసుకుంటున్నారు. శాశ్వత ఆర్జిత సేవలతో పాటు నిత్య పూజలు, నిత్యాన్నదానం, గోపూజలో నేరుగా పాల్గొనేలా ప్రణాళిక రూపొందించారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో అందుబాటులో ఉన్న పలు సేవల వివరాలిలా..

– భద్రాచలం

తులసీమాల అలంకరణ

స్వామివారికి ప్రతీ శనివారం రూ.1000తో ఈ సేవ అందుబాటులో ఉంటుంది. ఉదయం 7 గంటలకు దంపతులు లేదా ఒకరి శిరస్సుపై తులసీ మాలల ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయిస్తారు. అనంతరం అంతరాలయంలో వారి సమక్షంలో ధ్రువమూర్తులకు అలంకరణ చేస్తారు. ఇందులో పాల్గొన్న వారికి కండువా, జాకెట్‌పీసు, 100 గ్రాముల రెండు లడ్డూలు, అంతరాలయ అర్చనతో రామకోటి పుస్తకం అందిస్తారు.

నిత్య సర్వ కైంకర్య సేవ

ప్రతి రోజూ జరిగే ఈ సేవలో భక్త దంపతులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొనే అవకాశం ఉంది. ఇందుకు రూ. 5వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఆలయంలో జరిగే సుప్రభాతం, అభిషేకం, అంతరాలయ అర్చన, శ్రీ లక్ష్మీ అమ్మవారి అర్చన, శ్రీ ఆంజనేయ స్వామి వారి అర్చన, నిత్యకల్యాణం, దర్బారు సేవ, పవళింపు(ఏకాంత) సేవలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. వారికి వేదాశీర్వచనంతో పాటు సచిత్ర రామాయణం పుస్తకం, ముత్యాల తలంబ్రాల ప్యాకెట్, అన్నప్రసాదం అదనంగా ఐదుగురికి అందజేస్తారు. అయితే ఆదివారం భక్తులు అధికంగా వస్తుండడంతో ఆ రోజు పది మందికి మాత్రమే ఈ అవకాశం కల్పిస్తారు.

శ్రీరామనవమి ముత్యాల సమర్పణ

రూ.10 వేలు చెల్లించి భక్తులు ఈ సేవలో పాల్గొనే అవకాశం ఉంది. వారికి శ్రీరామనవమి కల్యాణ టికెట్(ఉభయం), ఉభయదాతకు కల్పించే అన్ని సౌకర్యాలు, 108 ముత్యాలతో కూడిన తలంబ్రాలను అందజేస్తారు.

నిత్య పూల అలంకరణ

భక్తులు రూ.5 వేలు చెల్లిస్తే సోమవారం నుంచి శనివారం వరకు జరిగే పూజల్లో స్వామివారికి, ఉపాలయాల్లో అవసరమైన పూల దండలు వారి పేరున సమర్పిస్తారు. ఇందులో పాల్గొనే భక్తులకు కండువా, జాకెట్ పీసు, 100 గ్రాముల రెండు లడ్డూలు, నలుగురికి అన్నప్రసాదం అందజేస్తారు.

తులాభారం

ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. తులాభారంలో భక్తులకు తమకు నచ్చిన వస్తువులను స్వామి వారికి సమర్పించొచ్చు.

ఇతర ఆర్జిత సేవలిలా..

రూ.100తో భద్రుని గుడిలో అభిషేకం (సోమవారం నుంచి శనివారం వరకు), రూ.200తో అంతరాలయంలో సుప్రభాత సేవ, రూ.300తో మూలవరులకు అర్చన (ఒకరు లేదా ఇద్దరు), రూ.200తో ఉత్సవమూర్తులకు సహస్ర నామార్చన, (ఒకరు లేదా దంపతులు), రూ.200తో పవళింపు సేవ (అంతరాలయంలో), రూ.500తో ఆదివారం మూలమూర్తులకు సువర్ణ పుష్ప అష్టోత్తర నామార్చన, రూ.500తో శనివారం సువర్ణ తులసీ అష్టోత్తర నామార్చన, రూ.1000తో గరుడ, హంస, హనుమంత, రాజాధిరాజ వాహనం (ఒక్కొక్క దానికి ఒక్కో రోజు), రూ.1500తో నిత్యకల్యాణం (ఇద్దరికి), రూ.1500తో ఆదివారం రోజున మూలమూర్తులకు అభిషేకం వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి.

శాశ్వత సేవలు..

భక్తులకు శాశ్వత సేవలు అందుబాటులో ఉన్నాయి. రూ.10 వేలతో గరుడ, హంస, అశ్వ, సూర్య ప్రభ సేవలు, ఒక్కో సేవకు శాశ్వత ఉభయం(బోయీల ఖర్చు అదనం), శరన్నవరాత్రి, ముక్కోటి ఏకాదశి మహోత్సవాల్లో దశావతరాల అలంకరణలకు రోజుకు రూ.10వేలు, రూ.50 వేలు చెల్లిస్తే శాశ్వత పుష్పాలంకరణ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు శాశ్వత పుష్యమీ పట్టాభిషేకం, శాశ్వత నిత్యాన్నదానం, లక్ష కుంకుమార్చన, ఇతర సేవల వివరాలను దేవస్థానం వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

ఆన్‌లైన్‌లోనూ టికెట్లు..

భక్తులకు అవసరమైన సేవా టికెట్లను దేవస్థానంలో ఏర్పాటు చేసిన విక్రయ కేంద్రాల వద్ద నేరుగా కొనుగోలు చేయొచ్చు. లేదా ఆన్‌లైన్‌లో దేవస్థానం వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ముందుగానే టికెట్లు రిజర్వ్ చేసుకోవచ్చు. https://bhadraditemple.telangana.gov.in వెబ్‌సైట్‌లో దేవస్థానం సమాచారం, చుట్టుపక్కల గల పుణ్యక్షేత్రాలు, వసతి గృహాలు, కాటేజీల వివరాలు అందుబాటులో ఉంచారు.

వేదాశీర్వచనం



స్వామివారిని దర్శించుకున్న భక్తులకు వేదాశీర్వచనం చేస్తున్న అర్చకులు (ఫైల్)

గతంలో ప్రొటోకాల్ పరిధిలో ఉన్న వారికి మాత్రమే వేదాశీర్వచనం అందజేసేవారు. అయితే భక్తుల కోరిక మేరకు అందరికీ ఈ సేవ అందిస్తున్నారు. స్వామివారి దర్శనాంతరం బేడా మండపం లేదా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో (ఒక్కొక్కరికి లేదా దంపతులకు) రూ.500 టికెట్‌తో ఈ సేవ అందుబాటులో ఉంది. ఉదయం 8 నుంచి 11.30 వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు ప్రతీ అర్ధగంటకు ఒకసారి ఈ సేవ చేస్తారు. ఇందులో పాల్గొన్న భక్తులకు కండువా, జాకెట్‌పీసు, 100 గ్రాములు లడ్డూ అందజేస్తారు.

చిన్న గరుడ వాహన సేవ



చిన్న గరుడ వాహన సేవను ప్రారంభిస్తున్న ఈఓ రమాదేవి (ఫైల్)

స్వామి వారిని నిత్యకల్యాణానికి, ఇతర ఉత్సవాల్లో పల్లకీ సేవగా తీసుకెళ్లేందుకు ఉపయోగించే చిన్న గరుడ వాహనాన్ని పట్టేందుకు ఈ సేవను ఇటీవలే ప్రవేశపెట్టారు. రూ. 250 దేవస్థానం కౌంటర్లలో చెల్లించి పాల్గొనొచ్చు.

న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలి

- హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్
- దమ్మపేటలో కోర్టు భవనం ప్రారంభం



హైకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

దమ్మపేట : న్యాయవాదులు బెంచ్‌లతో సమన్వయంగా పనిచేయాలని హైకోర్టు న్యాయమూర్తి ఈ.వి.వేణుగోపాల్ అన్నారు. దమ్మపేటలో నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాన్ని శనివారం ఆయన మరో ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు బి.నగేష్, కె.శరత్‌తో కలిసి ప్రారంభించారు. ఆ తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కోర్టులో ఉన్న పెండింగ్ కేసులన్నీ విచారణ పూర్తి కావడానికి కొన్ని సంవత్సరాల కాలం పడుతుందన్నారు. న్యాయబద్ధమైన, విచారణకు అర్హత గల కేసులను మాత్రమే స్వీకరించి కోర్టు సమయాన్ని ఆదా చేయడంలో న్యాయవాదులు సహకరించాలని కోరారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ.. దమ్మపేట కోర్టు ఏర్పాటుకు ప్రస్తుత ఎమ్మెల్యే జారే ఆదినారయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఎంతో కృషి చేశారని చెప్పారు. అంతకుముందు కొత్తగూడెం సీనియర్ సివిల్ జడ్జి రామారావు దమ్మపేట కోర్టులో కొన్ని కేసులు పరిశీలించి వాయిదా వేశారు. కార్యక్రమంలో సత్తుపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్, వెంకట్రావు, గొంది మురళి పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్‌–1 శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని టీఎస్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈనెల 7వ తేదీ లోపు ఖమ్మంలోని స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 11 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని, వివరాల కోసం 08742–227427, 95738 59598 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

‘పల్స్‌పోలియో’ను విజయవంతం చేయండి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష, అధికారులు

కొత్తగూడెంరూరల్: జిల్లాలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష అన్నారు. లక్ష్మీదేవిపల్లి మొర్రేడు వాగు నుంచి రైల్వే స్టేషన్ వరకు శనివారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 3, 4, 5 తేదీల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లాలో 925 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 92 మంది రూట్ ఆఫీసర్లు, 38 ట్రాన్సిట్ సెంటర్లు, 38 మొబైల్ టీమ్‌ల ద్వారా జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులు 98,358 మందికి పోలియో చుక్కలు వేస్తామని వివరించారు. పోలియో రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. జిల్లాలోని 925 కేంద్రాల్లో ఆదివారం పోలియో చుక్కలు వేస్తామని, నేడు వేయించుకోని వారికి 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్త్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బాలాజీ, వైద్యశాఖ అధికారులు మధువరన్, స్పందన, ఫైజ్ మొహిద్దీన్, జి.నాగభూషణం పాల్గొన్నారు.

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈఓ వెంకటేశ్వరాచారి



విద్యార్థులకు పెన్నులు అందిస్తున్న డీఈఓ, పక్కన అధికారులు

పాల్వంచరూరల్ : త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి ఉపాధ్యాయులను ఆదేశించారు. మండలంలోని జగన్నాథపురం ఉన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం దాతలు అందజేసిన పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించడమే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి ఉత్తమ మార్కులు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మానిటర్ అధికారి నాగ రాజశేఖర్, సెక్టోరియల్ అధికారి ఎస్‌కే.సైదులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ పూర్ణచందర్‌రావు, యానంబైల్ హెచ్‌ఎం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు దళ సభ్యుడి లొంగుబాటు

వివరాలు వెల్లడించిన ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: మావోయిస్టు పార్టీ ఇల్లెందు – నర్సంపేట దళ సభ్యుడు పూనెం అడమయ్య అలియాస్ గణేష్ శనివారం జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఈ మేరకు కొత్తగూడెంలో ఎస్పీ రోహిత్‌రాజ్ వివరాలు వెల్లడించారు. ఆళ్లపల్లి మండలం అడవి రామారం గ్రామానికి చెందిన అడమయ్య 2023 జనవరిలో మావోయిస్టు పార్టీలో చేరి రెండు నెలల పాటు కొరియర్‌గా, ఆ తర్వాత ఇల్లెందు – నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి భద్రు దళంలో సభ్యుడిగా పని చేస్తున్నాడని తెలిపారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి తదితరుల మాటలకు ఆకర్షితుడై పార్టీలో చేరాడని చెప్పారు. అయితే ఆ పార్టీ ఆదివాసీల్లో ఆదరణ, నమ్మకం కోల్పోయి ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికే పరిమితం కావడం, బలవంతపు వసూళ్లకు పాల్పడుతుండడంతో అందులో ఇమడలేక లొంగిపోయాడని వివరించారు. మావోయిస్టు పార్టీ నుంచి బయటకు వచ్చి సాధారణ జీవనం గడపాలనుకునే దళ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తమ కుటుంబసభ్యుల ద్వారా, లేదా స్వయంగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

చిరస్మరణీయుడు.. శ్రీపాదరావు

జయంతి వేడుకల్లో డీఆర్‌ఓ రవీంద్రనాథ్



శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఆర్‌ఓ రవీంద్రనాథ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకున్న మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు మరణించినా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని జిల్లా రెవెన్యూ అధికారి రవీంద్రనాథ్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం శ్రీపాదరావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం డీఆర్‌ఓ మాట్లాడుతూ.. 1935 మార్చి 2న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడలో రాధాకృష్ణయ్య, కమలాబాయి దంపతులకు శ్రీపాదరావు జన్మించారని, గ్రామంలో ప్రాథమిక విద్య, ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో చదివారని, ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేశారని తెలిపారు. తండ్రి మరణానంతరం స్వగ్రామానికి వచ్చి రెండుసార్లు సర్పంచ్‌గా, మహాదేవ్‌పూర్ సమితి అధ్యక్షుడిగా సేవలందించారని, 1984 నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, స్పీకర్‌గా పనిచేశారని వివరంచారు. 1999 ఏప్రిల్ 13న నాటి నక్సలైట్లు ఆయనన కాల్చి చంపారని, మరణించినా ఇప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచారని నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ గన్యా, సహకార అధికారి ఖుర్షీద్, డీసీహెచ్ రవిబాబు, వ్యవసాయాధికారి బాబూరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర, యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

కొత్తగూడెంటౌన్: ప్రజా నాయకుడిగా, స్పీకర్‌గా రాష్ట్ర అభివృద్ధిలో దుద్దిళ్ల శ్రీపాదరావు అందించిన సేవలు మరువలేనివని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో శ్రీపాదరావు జయంతి వేడుకలు నిర్వహించారు. మొదట శ్రీపాదరావు చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సౌమ్య మనస్తత్వం గల వ్యక్తిగా ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టనష్టాల్లో పాలు పంచుకుని ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆయన చూపిన నిజాయితీ, నిరాడంబరత ఎప్పటికీ మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎంటీఓ సుధాకర్, వెల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కలిసి నడుద్దాం...

- ఖమ్మం వేదికగా మూడు విప్లవ పార్టీల విలీనం
- ‘మాస్‌లైన్’ ఆవిర్భావ సభకు ఏర్పాట్లు పూర్తి
- నేడు భారీ ప్రదర్శన, బహిరంగ సభ
- ఆ తర్వాత రెండు రోజులు ప్రతినిధుల సభలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన నేతలు



ఖమ్మంలో అరుణోదయ కళాకారుల ప్రదర్శన

ఖమ్మంమయూరిసెంటర్: మూడు విప్లవ పార్టీలు ఒకే పార్టీగా విలీనమవుతుండగా.. ఇందుకు ఖమ్మం వేదికగా నిలవనుంది. ప్రజా ఉద్యమాలు నిర్వహించిన పార్టీలు సైద్ధాంతిక అవగాహనతో ‘మాస్‌లైన్’గా ఏర్పాటవుతున్న సందర్భంగా ఖమ్మంలో యూనిటీ మహాసభలు నిర్వహిస్తున్నారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథాతోపాటు 16 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐలు జాతీయ పార్టీగా ఆవిర్భవించనున్నాయి. ఈ తరుణాన ఆదివారం ఖమ్మంలో భారీ ప్రదర్శన, వేలాది మందితో బహిరంగ సభ జరగనుంది. అలాగే, మరో రెండు రోజులు వందల మందితో నిర్వహించే ప్రతినిధుల సభలకు జిల్లా నాయకత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. సభల విజయవంతానికి నెలరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విస్తృత ప్రచారం చేశారు. అలాగే, ఖమ్మంలో ఆదివారం మొదలయ్యే సభలకు హాజరయ్యే నాయకులు, కార్యకర్తలకు స్వాగతం పలికేలా కూడళ్లలో అరుణ పతాకాల తోరణాలు ఏర్పాటు చేశారు.

30 వేలమందితో ర్యాలీ..

మూడు విప్లవ పార్టీలు ఐక్యమై జాతీయ పార్టీగా ఏర్పాటవుతున్న సందర్భంగా ఖమ్మంలో యూనిటీ సభ నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఆదివారం 30 వేల మందితో ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానం నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్, జెడ్పీ సెంటర్, వైరా రోడ్, మయూరిసెంటర్ మీదుగా పెవిలియన్ మైదానం వరకు ప్రదర్శన నిర్వహిస్తారు. అనంతరం వేలాది మందితో పెవిలియన్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇక్కడ సభా వేదికపై పార్టీల విలీనాన్ని ప్రకటిస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న ప్రతినిధులను ఉత్సాహపరిచేలా స్థానిక కళాకారులతో ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

సభా ప్రాంగణాలకు అమరుల పేర్లు

మూడు పార్టీలు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా ఆవిర్భవిస్తున్న సమయాన ఖమ్మంలో నిర్వహిస్తున్న మహాసభలకు నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే సభల్లో పాల్గొనేందుకు ఇతర రాష్ట్రాల నుంచి ప్రతినిధులు ఖమ్మం చేరుకున్నారు. కాగా, తొలిరోజు నిర్వహించే భారీ బహిరంగ సభా ప్రాంగణం, ఆ తర్వాత రెండు రోజులు జరిగే ప్రతినిధుల సభల ప్రాంగణానికి అమరుల పేర్లు పెట్టారు. బహిరంగ సభ నిర్వహించే పెవిలియన్ మైదానానికి రవన్న, సంతోష్‌నగర్‌గా, 4, 5 తేదీల్లో భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే ప్రతినిధుల సభ ప్రాంగణానికి డీ.వీ.కే., భాస్కర్‌నంది నగర్‌గా, సభావేదికకు శర్మిష్ఠ, శివరాం ప్రాంగణంగా నామకరణం చేశారు.

డప్పులతో ప్రదర్శన

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ మహాసభల సందర్భంగా శనివారం ఖమ్మంలో అరుణోదయ కళాకారులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎన్నెస్పీ క్యాంప్‌లోని ప్రజాపంథా కార్యాలయం నుంచి గట్టయ్య సెంటర్, బుర్హాన్‌పురం, బస్‌డిపో రోడ్డు, పెవిలియన్ గ్రౌండ్ నుంచి తిరిగి గట్టయ్య సెంటర్ వరకు ప్రదర్శన సాగింది. డప్పునృత్యాలు, ఆటపాటలతో ముందుకు సాగిన కళాకారులు మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం చేశారు.

క్లుప్తంగా

నేటి నుంచి అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీ

భద్రాచలంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నేటి నుంచి రాజీవ్ గాంధీ మూడో అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బసవరాజు, శ్రీను, అలీమ్, మణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలతో పాటు ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

బూర్గంపాడు: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంగా కృష్ణసాగర్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీదేవిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు అటవీశాఖ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



అధికారులు పట్టుకున్న ట్రాక్టర్

భద్రాచలంటౌన్: అనుమతులు లేకుండా గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నారు. పట్టణంలోని కూనవరం రోడ్ సమీపంలో నది నుంచి ఇసుక తరలిస్తుండగా వాహనాన్ని సీజ్ చేసి కార్యాలయానికి తరలించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓ పోస్ట్‌మాస్టర్ శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ గోదా నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామానికి చెందిన కోలేటి నవీన్ (34)కొద్ది కాలంగా తిరుమలకుంట బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. కాగా మద్యం తాగొద్దని భార్య చెప్పడంతో మనస్తాపం చెంది గత నెల 19న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మణుగూరులో ఇద్దరు..

మణుగూరు టౌన్: వేర్వేరుచోట్ల పురుగుల మందు తాగి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటనల్లో శనివారం పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని చినరాయిగూడేనికి చెందిన సబ్కా సాయి(20) తల్లి మందలించడంతో శుక్రవారం పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. బాపనకుంటకు చెందిన షేక్ ముసఫ్‌బాబా(50) భార్యతో గొడవ పడి క్షణికావేశంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల భారంతో రైతు...

ఇల్లెందురూరల్: అప్పుల భారంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ధనియాలపాడు గ్రామపంచాయతీ సేవ్యాతండాలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆంగోత్ అమ్రు (55) కుమారుడు వీరన్న అనారోగ్యానికి గురికావడంతో రూ.4 లక్షలు అప్పు చేసి చికిత్స అందించాడు. చేసిన అప్పు తీర్చేందుకు ప్రస్తుత వానాకాలం సీజన్‌లో తనకు ఉన్న రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. అయితే మిర్చి సాగుతో అప్పులు రెట్టింపయ్యాయి. దీంతో అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కుటుంబంలో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి కూడా ఘర్షణ జరిగింది. దీంతో అమ్రు మనస్తాపం చెంది శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వ్యాన్ దగ్ధం



దగ్ధమవుతున్న వ్యాన్

పాల్వంచ : గుర్తు తెలియని ఓమిని వ్యాన్ దగ్ధమైన ఘటన పట్టణంలోని కేటీపీఎస్ కాలనీలో గల విద్యుత్ కళాభారతి మైదానం వద్ద శనివారం రాత్రి జరిగింది. స్థానికులు గుర్తించి కేటీపీఎస్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అప్పాజీ ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. దగ్ధమైన వ్యాన్ గ్యాస్‌తో నడిచేదిగా గుర్తించారు. కాగా, వ్యాన్ ఎవరిది, అక్కడ ఎందుకు ఉంచారు. ఎలా దగ్ధమైందనే వివరాలు తెలియాల్సి ఉందని అసిస్టెంట్ కమాండెంట్ అప్పాజీ తెలిపారు.

అంతరిస్తున్న వన్యప్రాణులు

- ఉమ్మడి జిల్లా అటవీప్రాంతంలో ఇప్పటికే పులులు కనుమరుగు!
- అడవి దున్నలు, దుప్పులు, ఎలుగుబంట్ల సంచారమే అధికం
- నేడు ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం



పాల్వంచరూరల్: ఏటేటా వన్యప్రాణులు అంతరించిపోతున్నాయి. జంతు సంరక్షణ చట్టాలున్నా వేటగాళ్ల వేటుకు మూగజీవాలు బలవుతూనే ఉన్నాయి. ప్రతి సంవత్సరం అటవీ శాఖ, వైల్డ్‌లైఫ్ శాఖల అధికారులు జంతు సంరక్షణ చైతన్య దినోత్సవాలు నిర్వహిస్తున్నా వన్యప్రాణికి ముప్పు వీడటంలేదు. 2021–2022లో 25 జంతువధ కేసులు నమోదయ్యాయి. 2022లో 31 కేసులు, 2023లో ఆరు కేసులను నమోదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4.33 లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. అయినా వన్యప్రాణులు అంతరించిపోతున్నాయి.

- అటవీ ప్రాంతం క్రమంగా అంతరించిపోవడంతోపాటు గొత్తికోయ గుంపులు పెరుగుతున్నాయి. దీంతో అటవీ జంతువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. వేసవిలో నీళ్ల కోసం స్థావరాలను వదిలి ప్రాంతాలకు వెళ్తుండగా, ప్రమాదాలకు గురై అరుదైన జంతువులు కనుమరుగవుతున్నాయి. వేటుగాళ్లు ఉచ్చులు పెట్టి కూడా బలితీసుకుంటున్నారు.
- ఉమ్మడి జిల్లాలో జాతీయ మృగం పులి జాడ లేదు. అటవీ అధికారులు, ఎన్జీఓ బృందం వేర్వేరుగా వన్యప్రాణుల ఆక్యూపెన్సీ సర్వే చేపట్టారు. కానీ పెద్దపులుల జాడ లేకుండా పోయిందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కిన్నెరసాని అభయారణ్యంలోని పడిగాపురం బీట్‌లో 2015లో పులి సంచారాన్ని గుర్తించారు. 2018లో పులుల గణన చేపట్టగా, ఆనవాళ్లు కూడా లేవు.
- 2020, 2021లో సంవత్సరాల్లో పెద్దపులి అడుగు జాడలు కన్పించాయి. మళ్లీ 2022 నుంచి జాడ లేదు. అభయారణ్యంలోనే 20వేల హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం ఆక్రమణకు గురికావడంతో మాసాంహార జంతువులైన పులులు పూర్తిస్థాయిలో కనుమరుగైనట్లు తెలుస్తోంది. శాకాహార జంతువులైన అడవి గేదెలు, దున్నలు, ఎలుగుబంట్లు, చుక్కల దుప్పులు, కణుజులు అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.
- అటవీశాఖాధికారులు ఐదేళ్ల క్రితం వన్యప్రాణుల లెక్కలు విడుదల చేశారు. చుక్కల దుప్పులు, కొండగొర్రెలు, అడవి పిల్లులు, ఎలుగుబంట్లు, కణుజులు ఉన్నట్లు అటవీశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వీటితోపాటు కిన్నెరసాని రిజర్వాయర్‌లో వేల సంఖ్యలో మొరేజాతి మొసళ్లు ఉన్నాయి. నెమళ్లు, కుందేళ్లు, కొండముచ్చులు తదితర రకాల జంతువులు అడవుల్లో సంచరిస్తున్నట్లు గుర్తించారు. జంతువుల సంరక్షణకు వైల్డ్‌లైఫ్ చట్టాలు అమలు చేస్తున్నా వేటగాళ్ల బారినుంచి కాపాడలేకపోతున్నారు. వారు చాటుమాటుగా అటవీ ప్రాంతాల్లో జంతువులను వేటాడి వధిస్తున్నారు.

అటవీశాఖ గణాంకాల ప్రకారం వన్యప్రాణుల వివరాలు	
చుక్కల దుప్పులు	4,278
కొండగొర్రెలు	658
అడవి పిల్లులు	674
అడవిగేదెలు	1,892
ఎలుగుబంట్లు	412
కణుజులు	508

జంతు సంరక్షణ చర్యలు చేపడుతున్నాం



జిల్లాలో అటవీ జంతువుల సంరక్షణపై నిఘా పెట్టాం. అటవీప్రాంతంలో 30 బేస్‌క్యాంప్‌లను ఏర్పాటు చేసి 150 మందిని నియమించాం. ప్రత్యేక యాప్ ద్వారా సిబ్బంది బీట్ల వారీగా పహారా కాస్తున్నారు. జంతు సంరక్షణకు సోలార్ పంపు సెట్లు, చెక్‌డ్యామ్‌లు, సాసర్‌పిట్లను ఏర్పాటు చేస్తున్నాం. ఏటా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహనా కార్యక్రమాలు కూడా చేపడుతున్నాం.

–కృష్ణగౌడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీశాఖాధికారి

‘రుణ మోసం’పై విచారణ

- బాధితులు, బ్యాంకు అధికారుల నుంచి వివరాల సేకరణ
- పోలీసు, టాస్క్‌ఫోర్స్, ఇంటలిజెన్స్ వేర్వేరుగా విచారణ
- నలుగురు మధ్యవర్తులు పరార్..



ఖాతాదారులను విచారిస్తున్న ఇంటలిజెన్స్ అధికారులు

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్, సంజయ్‌నగర్‌లకు చెందిన మహిళలు రుణ మంజూరు పేరుతో మోసపోయిన ఘటనపై ఎట్టకేలకు పోలీస్ యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఈ వ్యవహారంపై ‘రుణం పేరిట నయా మోసం’ శీర్షికన గత నెల 22న ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. అనంతరం కూడా వరుస కథనాలు రావడంతో శనివారం పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్స్, ఇంటలిజెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. తమకు తెలియకుండానే తమ పేర్లతో ఖమ్మానికి చెందిన వ్యక్తులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కరెంటు అకౌంట్లు ప్రారంభించి మోసం చేశారని ఆరోపిస్తూ బాధితులు సల్మా, నజియా, అఫ్రిన్, సౌజన్య, సంధ్య శుక్రవారం ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో శనివారం ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులను, బాధిత మహిళలను సీఐ కరుణాకర్ విచారించారు. కొత్తగూడెం నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్ అధికారులు సైతం వేర్వేరుగా చేసిన విచారణలో అవే విషయాలను సేకరించారు.

బాధితులకు తెలియకుండా అకౌంట్లు..

ఇల్లెందు మండలం ఇందిరానగర్‌కు చెందిన చైతన్య, హైమావతి, ఖమ్మానికి చెందిన ప్రియాంక, హర్షలు కొటక్ మహేంద్ర బ్యాంకు నుంచి రుణాలు ఇప్పిస్తామని బాధితులతో నమ్మబలికారు. అదేసమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పత్రాలపై కూడా సంతకాలు తీసుకుని, బాధితులకు తెలియకుండా అకౌంట్లు తెరిచారు. బాధితుల పేరు మీద సిమ్, ఏటీఎం కార్డులను మధ్యవర్తులు పొందారు. కాగా ఇంటికి వచ్చి ఖాతాలు తెరిపించిన హెచ్‌డీఎఫ్‌సీ ఉద్యోగి సాయి మాత్రం నిబంధనల మేరకు తాను అకౌంట్లు ఓపెన్ చేసినట్లు చెబుతున్నారు.

హరియాణా, గుజరాత్ నుంచి లావాదేవీలు..

ఐదుగురు బాధితుల అకౌంట్ల నుంచి గత జనవరి 9వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రూ.3.29 కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. నగదు జమ చేసిన రోజే విత్ డ్రా కూడా చేశారు. హరియాణా, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన బ్యాంకులలో పలువురి ఖాతాల నుంచి నగదు ఖమ్మం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలకు బదిలీ అవుతున్నట్లు ఫిర్యాదు అందగా, అక్కడి ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఇది గమనించిన మోసగాళ్లు జనవరి 24 తరువాత బ్యాంకులో తమ లావాదేవీలను నిలిపివేశారు. ఖాతాలకు లింకై న ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో చిరునామా ఆధారంగా ఇల్లెందు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులు ఖాతాదారుల ఇంటికి వచ్చి విచారించడంతో మోసం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం వెలుగు చూసిన ఫిబ్రవరి 19 నుంచి నలుగురు మధ్యవర్తులు పరారీలో ఉన్నట్లు పోలీస్ విచారణలో తేలింది. మధ్యవర్తులను పట్టుకుని విచారిస్తేనే రూ. 3.29 కోట్ల లావాదేవీల వ్యవహారం పూర్తిగా వెల్లడికానుంది. నగదు లావాదేవీలు ఎందుకు జరిగాయి? అందులో బాధితులుగా చెప్పబడుతున్న మహిళలు, ఇతర బ్యాంకు సిబ్బంది పాత్ర ఏమైనా ఉందా అనే విషయాలు వెలుగుచూస్తాయి. కాగా నలుగురు మధ్య వర్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అడవులు వీడండి.. ఊర్లోకి రండి

జనజీవన స్రవంతిలో కలవాలని మావోలకు పోలీసుల పిలుపు



గుండాలలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ వద్ద పోలీసులు

గుండాల/కరకగూడెం/చర్ల : ‘మావోయిస్టులారా.. మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తోంది.. ఊరు రమ్మంటోంది.. కాలం చెల్లిన సిద్ధాంతాలు వీడండి.. అమూల్యమైన జీవితాన్ని కాపాడుకోండి’ అంటూ పోలీసులు గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతూ శనివారం గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం, చర్ల మండలాల్లో పోలీసులు ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గుండాల సీఐ రవీందర్, కరకగూడెం ఎస్సై ఏ.రాజేందర్ తదితరులు మాట్లాడుతూ.. మావోయిస్టులు కుటుంబాన్ని వదిలిపెట్టి కాలం చెల్లించిన సిద్ధాంతాల పేరుతో అమూల్యమైన జీవితాలను ఆగం చేసుకోవద్దని కోరారు. ‘మీ స్వేచ్ఛ, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది’ అని పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, అందులో మావోయిస్టులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. ప్రభుత్వం అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. తమ వద్దకు వస్తే ఎలాంటి హానీ తలపెట్టకుండా ఇళ్లకు పంపిస్తామని, పునరావాస కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇస్తోందని వెల్లడించారు.

మావోయిస్టు మిలీషియా డిప్యూటీ కమాండర్ అరెస్ట్

దుమ్ముగూడెం/భద్రాచలంఅర్బన్: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన మిలీషియా డిప్యూటీ కమాండర్ కారం వెంకటేష్ అలియాస్ వెంకన్నను పోలీసులు అరెస్ట్ చేశారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. దుమ్ముగూడెం పోలీసులు, 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది పైడిగూడెం దగ్గర శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కిష్టారం పీఎస్ పరిధి సాకిలేరుకు చెందిన మిలీషియా డిప్యూటీ కమాండర్ వెంకటేశ్ పటుబడ్డాడు. ఆయన బాల్యం నుంచే మావోయిస్టు పార్టీ బాలల సంఘంలో సభ్యుడిగా పనిచేస్తూ 2017లో సాకిలేరు గ్రామ మిలీషియా సభ్యుడిగా నియామకమయ్యాడు. ఆ తర్వాత 2022లో మిలీషియా డిప్యూటీ కమాండర్‌గా ఎదిగాడు. 2017లో సాకిలేరు వద్ద పోలీసులకు, మావోల నడుమ జరిగిన ఎదురుకాల్పుల ఘటనతోపాటు ఇటీవల పోటాకపాల్లి, దుబ్బమరక సీఆర్పీఎఫ్ క్యాంపులపై దాడి ఘటనల్లో పాల్గొన్నాడని ఏఎస్పీ తెలిపారు. వెంకటేష్‌ను భద్రాచలం కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ సెకండ్ ఇన్ కమాండెంట్ ప్రీతా, సీఐ బి.అశోక్ పాల్గొన్నారు.

లేబర్ ట్రిబ్యునల్ కోర్టు ఏర్పాటు చేయాలని వినతి



న్యాయమూర్తికి సమస్యలను వివరిస్తున్న న్యాయవాదులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో లేబర్ ట్రిబ్యునల్ కోర్టు ఏర్పాటు చేయాలని హైకోర్టు న్యాయమూర్తులు భీమపాక నగేష్, కాజా శరత్, ఈ.వీ.వేణుగోపాల్‌ను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. శనివారం దమ్మపేటలో కోర్టు ప్రారంభోత్సవానికి వెళ్తున్న న్యాయమూర్తులను ఆయన కొత్తగూడెంలో కలిసి మాట్లాడారు. జిల్లాలో వేలాదిగా కార్మికులు ఉండగా కోర్టు కేసుల నిమిత్తం వరంగల్ వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ఈమేరకు కొత్తగూడెంలోని లేబర్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు.

బార్ అసిసోయేషన్ ఆధ్వర్యాన...

కొత్తగూడెంటౌన్: హైకోర్టు న్యాయమూర్తి ఈ.వీ.వేణుగోపాల్ శనివారం జిల్లా కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసి పలు సమస్యలను వివరించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో కొనసాగుతున్న ఎనిమిది కోర్టుల్లో అవసరమైన ఉద్యోగులను నియమించడంతో పాటు కొత్తగూడెం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ కోర్టుకు ప్రభుత్వ న్యాయవాదిని నియమించాలని, పదెకరాల స్థలంలో నూతన కోర్టు భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌కుమార్ మక్కడ్, రావిలాల రామారావుతో పాటు దుంద్ర రమేష్, పిట్టల రామారావు, యాస యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి దొంగలు అరెస్ట్

32 బస్తాల మిర్చి, రూ.95 వేల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి: మిర్చి దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో శనివారం ఇల్లెందు డీఎస్పీ ఎన్.చంద్రభాను వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. మండలంలోని తొమ్మిదోమైలుతండా, తావుర్యాతండా, కోయగూడెం గ్రామాల్లో కల్లంలో పోసిన మిర్చి చోరీకి గురైనట్లు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తడికలపూడి క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఆటో ట్రాలీలో ముగ్గురు వ్యక్తులు మిర్చి లోడుతో తడికలపూడి వైపు నుంచి టేకులపల్లి వైపు వెళ్తున్నారు. వాహనాన్ని ఆపి వివరాలు ఆరా తీయగా తడబడుతూ సమాధానం చెప్పారు. దీంతో పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా మిర్చి చోరీ చేసినట్లు అంగీకరించారు. కొత్తగూడెంలోని గొల్లగూడెం ప్రాంతానికి చెందిన కోట రాంబాబు, మోకాళ్ల కృష్ణ, దేవనబోయిన శ్రీనివాస్ తొమ్మిదోమైలుతండాలో 20 బస్తాల మిర్చి దొంగిలించి ఏన్కూరు మిర్చి మార్కెట్‌లో రూ.1.20 లక్షలకు విక్రయించారు. కోయగూడెం ఏరియాలో 20 బస్తాల మిర్చి చోరీ చేసి దాచి ఉంచారు. తావుర్యాతండా వద్ద దొంగిలించిన 12 బస్తాల మిర్చిని శుక్రవారం తీసుకుపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 32 బస్తాల మిర్చి, రూ.95వేల నగదు, ఆటో ట్రాలీ, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐ షేక్ సైదా రవూఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

1.52 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



గంజాయి, నిందితులతో పోలీసులు

పాల్వంచ : ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని రెజీనా స్కూల్ సమీపంలో ఎస్ఐ బి.రాము ఆధ్వర్యంలో శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆప్పీ ఆటో, దాని ముందు ఓ వ్యక్తి మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. పోలీసులను చూసి బైక్‌పై ఉన్న వ్యక్తి వెనుదిరగగా, ఆటోను కూడా వెనక్కు తిప్పి పారిపోతున్నారు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ఆటోలో గంజాయి ప్యాకెట్లు ఉన్నాయని గుర్తించి వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. గంజాయి 1.52 క్వింటాళ్లు ఉండగా, దాని విలువ రూ.52 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన మక్కా కృష్ణ, హరియాణా రాష్ట్రం హిసార్ జిల్లా దూర్జన్పూర్‌కు చెందిన రాంజీలాల్, పాల్వంచ నెహ్రూనగర్‌కు చెందిన మక్కా హరిగా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కన్నబిడ్డలపై తండ్రి కత్తితో దాడి

దుమ్ముగూడెం : మద్యం మత్తులో తండ్రి తన ఇద్దరు పిల్లలపై కత్తితో దాడి చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా మెటగూడలో శనివారం జరిగింది. మద్యం మత్తులో తండ్రి తన ఇద్దరు పిల్లలను కత్తితో పొడవగా, ఇద్దరికీ తీవ్ర గాయలయ్యాయి. చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు సుక్మా జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సుక్మా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

అనారోగ్యంతో నర్సింగ్ విద్యార్థిని మృతి



ఉమాభారతి(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు కుమార్తె, నర్సింగ్ విద్యార్థిని ఉమాభారతి(19) అనారోగ్యంతో ఖమ్మంలో ఆస్పత్రిలో శనివారం మృతి చెందింది. ఉమాభారతి భద్రాచలంలో మారుతి నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఎనిమియాతో బాధపడుతున్న ఆమెను శుక్రవారం ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. విద్యార్థి మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంఅర్బన్: బైక్‌పై ఒడిశా నుంచి హైదరాబాద్‌కు 1,950 గ్రాముల గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. యాదాద్రి జిల్లా బీబీ నగర్‌కు చెందిన కార్తీక్‌రావు, కె.దుర్గాప్రసాద్ హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. గంజాయి వ్యసనం బారినపడ్డ వీరు ఒడిశాలోని మల్కనగిరి నుంచి గంజాయి కొని తెస్తున్నారు. ఈ క్రమంలో ఎక్సైజ్ అధికారులు శనివారం భద్రాచలంలో తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడ్డారు. నిందితులను అరెస్ట్ చేసి, 2 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రమేష్ తెలిపారు.

ఇచ్చుకో.. దండుకో

డబ్బుతో రండి.. అధికారంలోకి వస్తే దండుకోండి

బడాబాబులకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఓపెన్ ఆఫర్

- కోట్లు ఇచ్చే ఎన్నారైలు, కాంట్రాక్టర్లు, రియల్టర్లు, వ్యాపారులకే పెద్దపీట
- పెమ్మసాని, వెనిగండ్ల రాము, అమిలినేని సురేంద్రబాబు, కాకర్ల సురేష్‌లకు రెడ్‌కార్పెట్



- అధికారంలోకి వస్తే ప్రజాధనాన్ని దోచుకునే వెసులుబాటు కల్పిస్తానంటూ బాబు భరోసా
- మరింతమందికి గాలం వేసేందుకు బాబు, చినబాబు పన్నాగాలు..
- ఓటమి భయంతో ముందుకు రాని 'పెట్టుబడి'దారులు
- టీడీపీ– జనసేన సభ అట్టర్ ఫ్లాప్‌తో వెనుకంజ

సాక్షి, అమరావతి: రాజకీయాలను పక్కా వ్యాపారంగా మార్చేసి.. ఓటుకు కట్లు అలవాటు చేసిన పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇపుడు సొమ్ములున్న బడాబాబులకు రకరకాల ఆఫర్లతో సీట్లు ఎరవేస్తున్నారు. వందల కోట్లు పార్టీ ఫండ్‌గా ఇచ్చుకో.. అన్నీ కుదిరి అధికారంలోకి వస్తే దొరికినంత దోచుకో.. ఇదీ 'పెట్టుబడి'దారులకు చంద్రబాబు ఓపెన్ ఆఫర్. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీని నమ్ముకుని పనిచేస్తున్న సీనియర్ నేతలను పక్కనపెట్టి.. సొమ్ములు సమకూర్చడానికి అంగీకరించిన ఎన్నారైలు, కాంట్రాక్టర్లు, రియల్టర్లు, వ్యాపారులకు అభ్యర్థుల ఎంపికలో పెద్దపీట వేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక మంత్రివర్గంలోకి తీసుకుని కీలక మంత్రిత్వ శాఖను అప్పగిస్తానని కొందరికి.. భారీ ఎత్తున లాభాలు వచ్చే కాంట్రాక్టు పనులు, గనులు అప్పగిస్తానంటూ మరికొందరికి భరోసా కల్పిస్తున్నారు. విభజన తర్వాత 2014 ఎన్నికల్లో భారీగా నిధులు సమకూర్చిన నారాయణ విద్యా సంస్థల అధినేత పొంగూరు నారాయణను ఎమ్మెల్సీని చేసి, రాజధాని నిర్మాణంతో ముడిపడిన కీలకమైన పురపాలక పట్టణాభివృద్ధి శాఖ అప్పగించానని గుర్తు చేస్తున్నారు. రాజధాని ప్రాంతంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడిన భారీ ఎత్తున భూములు కాజేసిన నారాయణ.. ఇన్నర్ రింగ్ అలైన్‌మెంట్ మార్చేసి, రాజధానిలో తాత్కాలిక నిర్మాణాలతో పాటు స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు, శాశ్వత నిర్మాణాల పనుల టెండర్లు, టిడ్కో గృహాల టెండర్లలో భారీ ఎత్తున అవినీతికి పాల్పడి వేలాది కోట్ల రూపాయలను కొల్లగొట్టాడు.. అవన్నీ ఇపుడు కేసులై మెడకు చుట్టుకున్నాయనుకోండి.. అది వేరే సంగతి...

పెమ్మసాని నుంచి అమిలినేని దాకా..

గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ రాజకీయాల నుంచి నిష్క్రమించడంతో ఆ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు టీడీపీ సీనియర్ నేత, ట్రాన్స్‌ట్రాయ్ అధినేత రాయపాటి సాంబశివరావు ఆసక్తి చూపారు. పోలవరం హెడ్ వర్క్స్ పనులను 2013లో దక్కించుకున్న రాయపాటి మొబిలైజేషన్ అడ్వాన్సుగా ప్రభుత్వం నుంచి తీసుకున్న సొమ్ములో రూ.150 కోట్లు 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు ఇవ్వడం వల్లే నరసరావుపేట లోక్‌సభ స్థానం అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారని రాయపాటి తనయుడు రాయపాటి రంగరావు ఇటీవల అంగీకరించారు. ట్రాన్స్‌ట్రాయ్ దివాలా తీయడం, రాయపాటి ఆర్థికంగా కుదేలవడంతో ఈసారి టికెట్ ఇచ్చేది లేదని చంద్రబాబు కుండ బద్దలు కొట్టేశారట. తెనాలికి చెందిన ఎన్నారై పెమ్మసాని చంద్రశేఖర్ భారీ ఎత్తున పెట్టుబడి పెడుతుండడంతో ఆయనను గుంటూరు లోక్‌సభ అభ్యర్థిగా ఖరారు చేశారు. ఇదే రీతిలో పెట్టుబడి పెట్టడంతో గుడివాడ నియోజకవర్గంలో సీనియర్ నేత రావి వెంకటేశ్వరరావును పక్కన పెట్టి టీడీపీ అభ్యర్థిగా ఎన్నారై వెనిగండ్ల రామును.. విజయవాడ లోక్‌సభ అభ్యర్థిగా కేశినేని చిన్నిలను చంద్రబాబు ఎంపిక చేశారు. నెల్లూరు జిల్లాలో ఉదయగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావును పక్కన పెట్టి.. పెట్టుబడి పెట్టిన ఎన్నారై కాకర్ల సురేష్‌ను చంద్రబాబు ఎంపిక చేశారు. రాష్ట్రంలో 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు హంద్రీ–నీవా రెండో దశ పనుల్లో పాత కాంట్రాక్టర్లపై 60–సీ నిబంధన కింద తొలగించి.. మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసి అమిలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్‌కు కట్టబెట్టిన చంద్రబాబు.. భారీ ఎత్తున కమీషన్లు వసూలు చేసుకున్నారు. ఇప్పుడు కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబు పెట్టుబడి పెట్టడంతో అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరికి మొండి చేయి చూపారు. అమిలినేని సురేంద్రబాబును అభ్యర్థిగా ఖరారు చేశారు.

ఓటమి భయంతో పెట్టుబడిదారులు వెనుకంజ..

ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి జనవరి 27న భీమిలి.. గత నెల 3న దెందులూరు.. గత నెల 18న రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలకు సముద్రంతో పోటీ పడుతూ జనం పోటెత్తడంతో ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఉమ్మడి, తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు సభ అతి పెద్ద ప్రజాసభగా నిలిచింది. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ సునామీ సృష్టించడం ఖాయమని రాప్తాడు 'సిద్ధం' సభతో తేలిపోయిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. టైమ్స్ నౌ, జీన్యూస్, రిపబ్లిక్ టీవీ, జన్‌మత్, జనాధార్ ఇండియా వంటి జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ప్రీపోల్ సర్వేల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమని.. మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమని వెల్లడించాయి. టీడీపీ–జనసేన పొత్తులో సీట్ల పంపకాల 'లెక్క' తేలాక ఇరు పక్షాలు తొలిసారిగా ఉమ్మడిగా పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెంలో గత నెల 28న 'తెలుగుజన విజయకేతన జెండా' సభకు జనం మొహం చాటేయడంతో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. అవకాశవాదంతో పొత్తు పెట్టుకోవడం వల్లే ఆ రెండు పక్షాలు ఉమ్మడిగా నిర్వహించిన తొలి సభలోనే జనం ఛీకొట్టారని.. ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమి ఘోరంగా ఓడిపోతుందనడానికి ఇది సంకేతమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో వాస్తవ పరిస్థితిని పసిగట్టిన పెట్టుబడిదారులు ఓటమి భయంతో టీడీపీలో చేరేందుకు ఇప్పుడు వెనుకంజ వేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో సీట్లు దక్కని వారితో చేరికల డ్రామాలు..

వ్యక్తిగత కారణాలతో.. టికెట్లు దక్కక వైఎస్సార్‌సీపీని వీడిన వారిని చేర్చుకోవడం ద్వారా టీడీపీకి క్రేజ్ ఉందని చూపి పెట్టుబడిదారులను సమ్మోహనపరిచేందుకు చంద్రబాబు ఎత్తులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే వ్యక్తిగత కారణాలతో.. టికెట్లు దక్కక వైఎస్సార్‌సీపీని వీడిన లావు కృష్ణదేవరాయలు, వసంత కృష్ణప్రసాద్, జంగా కృష్ణమూర్తి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలకు చంద్రబాబు టీడీపీ తీర్థం ఇచ్చారు. ఇందులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా, ఆయన భార్య ప్రశాంతిని కోవూరు అభ్యర్థిగా.. లావు కృష్ణదేవరాయలును నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థిగా.. వసంత కృష్ణప్రసాద్‌ను మైలవరం అభ్యర్థిగా చంద్రబాబు ఖరారు చేశారని టీడీపీ వర్గాలు వెల్లడించాయి.

ఈసారి నారాయణ వాటా రూ.900 కోట్లు..

నారాయణ విద్యాసంస్థల అధినేత పొంగూరు నారాయణ 2014 వరకూ చంద్రబాబు ఆర్థిక వ్యవహారాలను పరోక్షంగా చూశారు.. ఆ ఎన్నికల్లో టీడీపీకి భారీ ఎత్తున నిధులు సమకూర్చారు. భారీ ఎత్తున ధనం వెదజల్లడంతో 2014 ఎన్నికల్లో కేవలం 5 లక్షల ఓట్ల తేడాతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. మంత్రివర్గంలో నారాయణకు కీలకమైన పురపాలక పట్టణాభివృద్ధి శాఖను కేటాయించిన చంద్రబాబు.. ఆ తర్వాత ఎమ్మెల్సీని చేశారు. ఐదేళ్లపాటు ఆకాశమే హద్దుగా చెలరేగిన నారాయణ భారీ ఎత్తున ప్రభుత్వ ఖజానాను.. ప్రజల ఆస్తులను దోచేశారు. గత ఎన్నికల్లో నెల్లూరు అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘోరంగా ఓడిపోయిన నారాయణ.. వచ్చే ఎన్నికల్లో అదే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. టీడీపీకి ఎన్నికల ఖర్చుల కోసం ఇప్పటికే ప్రజల నుంచి మార్వాడీలు, వ్యాపారుల నుంచి రూ.650 కోట్లను సమీకరించిన నారాయణ చేర్చాల్సిన చోటకు చేర్చారు. వారం క్రితం మార్కాపురం, కందుకూరు, గిద్దలూరు నియోజకవర్గాల్లో వ్యాపారుల నుంచి రూ.2 నుంచి రూ.3ల వడ్డీకి మరో రూ.250 కోట్లను సమీకరించిన నారాయణ టీడీపీకి ఎన్నికల నిధి కింద అందజేశారు. మొత్తమ్మీద ఈసారి తన వాటాగా నారాయణ రూ.900 కోట్లు సమకూర్చారని టీడీపీ వర్గాలే చెబుతున్నాయి.

హైదరాబాద్‌లో మకాం వేసి రాయ 'బేరాలు'..

హైదరాబాద్‌లో మకాం వేసిన తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేశ్‌లు పెట్టుబడిదారులతో రాయబారాలు.. బేరసారాలు జరుపుతున్నారు. ఇప్పుడు పెట్టుబడి పెట్టండి.. కోరుకున్న స్థానం నుంచి పోటీ చేయండి.. అధికారంలోకి వస్తే దొరికినంత దోచుకోవడానికి వెసులుబాటు కల్పిస్తా అంటూ ఎన్నారైలు, రియల్టర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారులతో చంద్రబాబు రాయబారాలు నడుపుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ఫర్వాలేదు.. పెట్టుబడి పెడితే అధికారంలోకి వచ్చాక భారీ ఎత్తున దోచుకోవడానికి అవకాశం కల్పిస్తానంటూ రాజకీయాల నుంచి నిష్క్రమించిన ఆ పార్టీ ప్రజాప్రతినిధితోనూ చంద్రబాబు బేరసారాలు జరిపినా ఫలితం రాలేదని టీడీపీ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

జగన్‌ను గెలిపించాలి.. జనం గెలవాలి

బీసీ కులాల ఆత్మీయ సమావేశం పిలుపు


బీసీ కులాల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ఎంపీ కేశినేని నాని

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించడం ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలు మళ్లీ గెలవాలని బీసీ కులాల ఆత్మీయ సమావేశం పిలుపునిచ్చింది. విజయవాడ గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో రాష్ట్రంలోని 139 బీసీ కులాలకు చెందిన సంఘాల ముఖ్య నేతల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ 58 నెలల పాలనలో బీసీలకు జరిగిన ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రయోజనాలపై పలువురు వక్తలు మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. జనాభాలో 52 శాతంపైగా ఉన్న బీసీలకు కనీసం 50 శాతం పదవులు ఇవ్వాలని ఇంతకాలం కొట్లాడామని, అయితే సీఎం వైఎస్ జగన్ బీసీలకు ఏకంగా 70 శాతం పదవులు ఇచ్చి సంఘ సంస్కర్తగా నిలిచారని అన్నారు. ఇటీవల తాను కర్ణాటక, తమిళనాడు ముఖ్యమంత్రులను కలిసినప్పుడు.. బీసీలైన మీరు బీసీలకు 50 శాతం పదవులు ఎందుకివ్వలేకపోతున్నారు? అని అడిగితే వాళ్లు ఇచ్చిన సమాధానం ఆశ్చర్యం కలిగించిందన్నారు. మేము 40 శాతం పదవులు ఇవ్వడానికే ఇబ్బందులు పడ్డామని, మీ ముఖ్యమంత్రిలాగా మేము బీసీలకు పదవులు ఇస్తే మా రాష్ట్రాల్లో సంపన్న వర్గాలు మమ్మల్ని సీఎం సీటులో కూర్చోనీయవని చెప్పారన్నారు. సీఎం వైఎస్ జగన్ మాదిరిగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రాధాన్యత ఇవ్వాలంటే ఎంతో ధైర్యం, సాహసం ఉండాలన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సామాజిక న్యాయాన్ని దేశం మొత్తం కీర్తిస్తోందన్నారు.

ఏపీలో కలుస్తామంటున్నారు..

ఏపీలో ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలు పట్ల పొరుగు రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమాలు చూసి తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా, కర్ణాటకలోని బళ్లారి ప్రాంత వాసులు తమను ఆంధ్రాలో కలపాలని దీక్షలు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలను చంద్రబాబు ఓటు బ్యాంకుగా చూస్తే.. సీఎం జగన్ మాత్రం తన కుటుంబ సభ్యులుగా చూస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ మరో 20 ఏళ్లపాటు ఏపీ ముఖ్యమంత్రిగా కొనసాగితే పేద వర్గాలు ధనవంతులుగా మారడం ఖాయమన్నారు. ఇది సీఎం జగన్ ఒక్కడి గెలుపుకోసం మాత్రమే కాదని, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల గెలుపు కోసమే అని కృష్ణయ్య చెప్పారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) మాట్లాడుతూ.. మానవ వనరుల అభివృద్ధే అసలైన అభివృద్ధి అని నమ్మి దానిని రాష్ట్రంలో అమలు చేసి చూపించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు.

గెలిచాక వైఎస్సార్‌సీపీ నేతల అంతు చూస్తా: బాబు

దాచేపల్లి: రాబోయే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమి విజయం సాధిస్తుందని, అధికారంలోకి రాగానే అమరావతి నిర్మాణాలు పూర్తి చేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో శనివారం టీడీపీ నిర్వహించిన రా.. కదలిరా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ నేతల అంతుచూస్తానని, వారికి భయపడకుండా 45 రోజులు పోరాడాలని కార్యకర్తలను రెచ్చగొట్టారు. పోలీసులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.


శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు

జిల్లా వార్తలు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మణుగూరురూరల్: అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) సీఈ బిచ్చన్న సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు మండలం చిక్కుడుగుంటలోని బీటీపీఎస్‌లో శనివారం మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన సీఈ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలోనే కాక కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్రే కీలకని తెలిపారు. ప్రస్తుత మహిళలు ఉద్యోగ, రాజకీయ, క్రీడారంగాల్లో రాణిస్తుండగా, మరింత పురోభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు పార్వతి, శ్రీనివాసరావు, రమేశ్‌బాబు, సూర్యనారాయణ, రమణమూర్తితో పాటు శ్రీనివాసరావు, కల్తీ నర్సింహారావు, సత్యనారాయణ, భీమ్యా, సుగుణాకర్‌రావు, సాయిప్రసాద్, గోపి, అనిల్, నాగేశ్వరరావు, నారాయణ, రమేశ్, లక్ష్మీప్రియ, రజనీ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ ఆస్తుల పరిరక్షణకు పాటుపడాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని సెక్యూరిటీ విభాగం ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ ఆస్తులను పరిరక్షించాలని జీఎం (సెక్యూరిటీ) దీక్షితులు సూచించారు. సెక్యూరిటీ సిబ్బందికి కొత్తగూడెంలోని ట్రెయినింగ్ సెంటర్‌లో ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండేలా శిక్షణ ఇస్తున్నామని, తద్వారా పనితీరు మెరుగుపడుతోందని చెప్పారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబర్చిన గోపే శ్రీనివాస్, ముజాఫర్ ఖాన్‌కు జీఎం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎండీ జాకీర్‌హుస్సేన్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కరకగూడెం : మండలంలోని సమత్ భట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన పోలెబోయిన సత్యనారాయణ(40) శనివారం రాత్రి తన ఇంటి ఎదుటే అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. బయటకు వెళ్లిన సత్యనారాయణ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా ఇంటిముందు పడిపోయి ఉన్నాడు. అతడి వద్దకు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. అయితే ఎవరో కొట్టి చంపి ఉంటారని తల్లిదండ్రులు అంటున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై ఎ. రాజేందర్ అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లక్ష్యం నెరవేరేనా?

- ఆరు డివిజన్ల పరిధిలో 54 తునికాకు యూనిట్లు
- సేకరణ లక్ష్యం 60,400 స్టాండర్డ్ బ్యాగ్‌లు
- రెండు దశల టెండర్లలో ముందుకు రాని కాంట్రాక్టర్లు
- వేసవి ముంచుకొస్తున్నా మొదలుకాని ప్రూనింగ్


తునికాకు సేకరిస్తున్న గిరిజనులు (ఫైల్)

పాల్వంచరూరల్: ఈ ఏడాది అటవీ అధికారులు నిర్దేశించుకున్న తునికాకు లక్ష్యం నెరవేరుతుందా.. గత ఏడాది మాదిరిగానే లక్ష్యానికి దూరంగా ఆగిపోతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 21,748 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ మాత్రమే జరిగింది. భద్రాద్రి జిల్లాలోని ఆరు అటవీ డివిజన్ల పరిధిలో తునికాకు సేకరణకు చేపట్టిన ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియ ఆలస్యంగా మొదలుకాగా, రెండు దఫాల్లోనూ యూనిట్లు అమ్ముడుపోలేదు. దీంతో మూడో దశపై అటు అధికారులు.. ఇటు గిరిజన, గిరిజనేతర కూలీలు ఆశలు పెట్టుకున్నారు.

రెండు దఫాల టెండర్లపై అనాసక్తి

ఈ ఏడాది తునికాకు సేకరణ కోసం తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన ఫిబ్రవరి 16 నుంచి 19వ తేదీ వరకు ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. రెండో దఫా టెండర్లు 26 నుంచి 28వ తేదీ వరకు చేపట్టారు. అయితే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 54 యూనిట్లు, ఖమ్మం జిల్లాలో ఐదు యూనిట్లు, భద్రాద్రి సర్కిల్ పరిధిలోని మహబూబాబాద్ డివిజన్‌లో నాలుగు యూనిట్ల పరిధిలో రెండు దఫాల టెండర్లలో ఒక యూనిట్ కూడా అమ్ముడుపోలేదని ఎఫ్‌డీఓ మహ్మద్ ఉస్మాన్ వెల్లడించారు.

సేకరణ లక్ష్యం 64,400 స్టాండర్డ్ బ్యాగ్‌లు

కొత్తగూడెం అటవీ సర్కిల్ పరిధిలో ఈ ఏడాది 64,400 స్టాండర్డ్ బ్యాగ్‌ల తునికాకు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో భద్రాచలం డివిజన్ పరిధిలో 9,700 స్టాండర్డ్ బ్యాగ్‌లు, పాల్వంచ డివిజన్ పరిధి ఏడు యూనిట్లలో 2,300 స్టాండర్డ్ బ్యాగ్‌లు, పాల్వంచ వైల్డ్‌లైఫ్ డివిజన్ ఐదు యూనిట్లు పరిధిలో 3,200 స్టాండర్డ్ బ్యాగ్‌లు, మణుగూరు డివిజన్ పరిధి ఐదు యూనిట్ల పరిధిలో 5,400 బ్యాగ్‌లు, కొత్తగూడెం డివిజన్ పరిధి నాలుగు యూనిట్లలో 3,900 బ్యాగ్‌లు, ఇల్లెందు డివిజన్ పరిధి ఎనిమిది యూనిట్లలో 10,600 స్టాండర్డ్ బ్యాగుల తునికాకు సేకరించాలనేది లక్ష్యం. ఇక జిల్లా సర్కిల్ పరిధిలోని మహబూబాబాద్ డివిజన్‌లో ఐదు యూనిట్లకు గాను 3,200 స్టాండర్డ్ బ్యాగ్‌లు, ఖమ్మం జిల్లాలోని ఐదు యూనిట్ల పరిధిలో 3,700 స్టాండర్డ్ బ్యాగ్‌ల తునికాకు సేకరించాలనేది అధికారుల లక్ష్యం. కాగా, ఖమ్మం జిల్లాలోని ఖమ్మం డివిజన్‌లో రెండు యూనిట్లు ఉండగా 800 స్టాండర్డ్ బ్యాగ్‌లు, సత్తుపల్లి డివిజన్ పరిధిలోని మూడు యూనిట్లకు గాను 2,900స్టాండర్డ్ బ్యాగ్‌ల తునికాకు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

సకాలంలో ప్రూనింగ్ చేస్తేనే లబ్ధి

తునికాకు సేకరణ కాంట్రాక్టు దక్కించుకున్న వారు అటవీశాఖతో అగ్రిమెంట్ పూర్తిచేసుకుని మార్చి నెలలో తునికాకు మోడెం కొట్టడం(ఆకు ప్రూనింగ్) మొదలుపెట్టాలి. తద్వారా చెట్టు చిగురించి సకాలంలో ఆకు సేకరణకు అవకాశముంటుంది. ఒకవేళ ఆకు ప్రూనింగ్ ఆలస్యమైతే సేకరణ కూడా సరైన సమయాన చేపట్టడం సాధ్యం కాదు. ఫలితంగా ఇటు తునికాకు సేకరణ లక్ష్యం నెరవేరకపోగా కూలీలకు గిట్టుబాటు కాదు. అయితే, ఈసారి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోగా, కూలీలు కూడా ఆకు సేకరణకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈ సంవత్సరం రెండు దఫాల్లోనూ టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోగా, మూడో దఫా గడువు ఈనెల 7వ తేదీన ముగియనుంది.

వేసవి పంటగా గుర్తింపు

ఏటా వేసవిలో తునికా సేకరణ కోసం గిరిజన, గిరిజనేతర కూలీలు ఆశగా ఎదురుచూస్తుంటారు. దీన్ని వేసవి పంటగా భావిస్తారు. ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల్లో తునికాకు సేకరణ చేపడుతూ వేలాది మంది కూలీలు ఎంతో కొంత డబ్బు సంపాదించుకుంటారు. తునికాకు సేకరణతో వచ్చే ఆదాయాన్ని పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు వినియోగిస్తారు. వేకువజామునే కుటుంబ సభ్యులంతా అడవిలోకి వెళ్లి గుట్టలు, పుట్టలు తిరిగి తునికాకు సేకరణ చేయడం.. సాయంత్రం కాగానే ఇళ్లకు చేరుకోగా వంద ఆకులను ఒక కట్టగా కట్టి సమీపంలోని కల్లాల్లో అప్పగించి వారానికోమారు డబ్బు తీసుకుంటారు. కాగా, తునికాకు సేకరణ ద్వారా భద్రాద్రి జిల్లాలో లక్షకు పైగా గిరిజన, గిరిజనేతర కూలీల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూరనుంది. మూడు నెలల కాలంలో ఒక్కో కూలీ రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఆదాయాన్ని సంపాదిస్తారని అంచనా.

తాగునీటి కోసం గ్రామస్తుల ఆందోళన



ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న కొత్తూరు గ్రామస్తులు (ఇన్‌సెట్) కొత్తూరులో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్న సిబ్బంది

- తెలంగాణ, ఏపీ నడుమ నాలుగు గంటలు నిలిచిన రాకపోకలు
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

అశ్వారావుపేటరూరల్: తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామపంచాయతీ పరిధి కొత్తూరు వాసులు శనివారం ఆందోళనకు దిగారు. తెలంగాణ – ఏపీ సరిహద్దు గ్రామం కావడం.. ప్రధాన రహదారిపై గ్రామస్తులు బైఠాయించడంతో రెండు రాష్ట్రాల నడుమ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వివరాలిలా ఉన్నాయి. కొత్తూరులో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోగా, గ్రామంలోని వాగులో ఉన్న ఫిల్టర్ పాయింట్ బోరు సైతం మరమ్మతుకు గురైంది. దీంతో గ్రామానికి నీటి సరఫరా జరగగా స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ప్రధాన రహదారిపై ముళ్ల కంప, వెదురు తడకలు, మొద్దులు అడ్డం వేసి ఖాళీ బిందెలతో రాస్తారోకోకు దిగారు. రహదారిపైనే టెంట్ వేసి ఉదయం 7నుంచి 11గంటల వరకు ఆందోళన కొనసాగించడంతో పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ శ్రీరాముల శ్రీను చేరుకుని నచ్చచెప్పినా వారు ససేమిరా అన్నారు. చివరకు ఎంపీడీఓ జి.శ్రీనివాస్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శ్రీనివాస్, లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి బాబు వచ్చి చర్చించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ప్రస్తుతం ప్రత్యామ్నాయ మార్గాల్లో సరఫరా చేస్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. కాగా, గ్రామస్తులు ఆందోళన సమయాన అశ్వారావుపేటలో ఇంటర్ పరీక్షకు వెళ్తున్న ఓ ప్రైవేట్ కళాశాల బస్సు నిలిచిపోయింది. సమయం దాటి పోతుండడంతో విద్యార్థులంతా పక్క నుంచి కాలినడక వెళ్లి మరో వాహనంలో కేంద్రాలకు బయలుదేరారు.

పంచాయతీ ట్యాంకర్‌తో నీటి సరఫరా

కొత్తూరులో తాగునీటి సమస్యపై గ్రామస్తుల ఆందోళన నేపథ్యాన అధికారులు స్పందించారు. శనివారం సాయంత్రం గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. అలాగే, తిరుమలకుంట వద్ద మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు పూర్తి చేసి రాత్రికి నీటి సరఫరా పునరుద్ధరించారు. అంతేకాకుండా కొత్తూరులోని వాగు ఫిల్టర్ పాయింట్‌లో ఉన్న బోరు మోటార్‌ను బయటకు తీసి మరమ్మతులకు పంపించారు.

సమ్మె విరమించిన ఔట్ సోర్సింగ్ వర్కర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు 18 నెలలుగా వేతనాలు రాకపోవడంతో సమ్మెకు దిగగా.. అధికారుల హామీతో శనివారం సమ్మె విరమించారు. వర్కర్లకు ఏడాదిన్నరగా వేతనాలు అందకపోవడంతో సీఐటీయూ ఆధ్వర్యాన గత నెల 28 నుంచి సమ్మె చేస్తున్నారు. ఈమేరకు శనివారం సీఐటీయూ నాయకులు ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని సీఐటీయూసీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి తెలిపారు. ఇప్పటికే ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు ఎనిమిది నెలల జీతాలు వారి అకౌంట్లతో జమ చేశారని పేర్కొన్నారు. డైలీ వేజ్ వర్కర్ల వేతనాల బడ్జెట్‌ను మరో వారం రోజుల్లో మంజూరవుతుందని డీడీ తెలిపారని వెల్లడించారు. ఔట్ సోర్సింగ్ వర్కర్ల ఇతర సమస్యలను సైతం అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డీడీ మణెమ్మ వెల్లడించారని చెప్పారు. తెలియజేసినట్లు బ్రహ్మచారి వెల్లడించారు. కాగా, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు అందాల్సిన మిగతా వేతనాలను కూడా ఈనెల 10వ తేదీలోగా చెల్లించకపోతే 16నుంచి తిరిగి సమ్మె చేపట్టనున్నట్లు డీడీకి ముందస్తు నోటీసును అందజేశామని తెలిపారు. ఈ చర్చల్లో ఏటీడబ్ల్యూఓ నర్సింహారావు, సీఐటీయూ నాయకులు నాగరాజు, హాస్టల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, నాయకులు పాయం ముత్తయ్య, స్వామి, కౌశల్య, స్వరూప, జయ, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంసహకారనగర్: ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన పథకం (పీఎంకేవీవై) 4.0 ద్వారా పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఖమ్మం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు ఇంటర్, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు, ఎలక్ట్రీషియన్ శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణత ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల కాలపరిమితితో కూడిన శిక్షణ కోసం ఈ నెల 15లోగా మెమోలు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం జిరాక్స్‌లు, రెండు ఫొటోలతో ఖమ్మం టేకులపల్లిలోని ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి


మాట్లాడుతున్న వెంకట్

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములు, బంజరు, పోడు భూములు ఉన్నందున పేదలకు పంపిణీ చేస్తే సాగు చేసుకుంటూ వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేస్తారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా లాంటి దేశంలో వ్యవసాయంపై కేవలం మూడు శాతం మంది ఆధారపడి ఉండగా.. 90 శాతం సబ్సిడీ ఇస్తున్నారని చెప్పారు. కానీ, భారత్‌లో 60 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నా రెండు శాతమే ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తున్నాయని పేర్కొన్నారు. తద్వారా వ్యవసాయ రంగం క్షీణిస్తున్నందున కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టి మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు. అలాగే, నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, బుర్రి ప్రసాద్, రాంబాబు, కల్యాణం వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, మాచర్ల భారతి, బండి పద్మ, బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.